వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

ప్రభాత వార్త

సోమవారం 05 మే 2025

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

**రాయచోటి మే 4 ప్రభాతవార్త :**



అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చి బాధితుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం, బోరెడ్డి గారిపల్లెలోని తమ నివాసం నందు మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్కరు కూడా సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ముందుకు వెళుతుందని అధికారులందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి న్యాయం చేయాలన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా ఎన్టీఏ నీట్ 2025 పరీక్ష..


### జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

### 2311 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు

**కడప, మే 4 : ప్రభాతవార్త**

జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాల్లో ఎన్టీఏ నీట్ 2025 పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప, ప్రొద్దుటూరు లోని మొత్తం 8 పరీక్షా కేంద్రాల్లో 2371 మంది విద్యార్థులు ఎన్రోల్ చేసుకోగా, 2311 మంది హాజరయ్యారని, 60 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారు. కడప నగర పరిధిలోని ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, నాగరాజు పేట, ప్రభుత్వ జూనియర్ కళాశాల, (గర్ల్స్), మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, ఎంసిహెచ్ఎస్ మెయిన్స్, అన్నమయ్య సర్కిల్, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం, వై ఆర్ జెడ్పిహెచ్ స్కూల్ (గర్ల్స్)..ఆరు పరీక్ష కేంద్రాల్లో ఎన్రోల్ చేసుకున్న 1839 విద్యార్థుల్లో 1788 మంది హాజరు కాగా, 51 మంది ఆబ్సెంట్ అయ్యారు.ప్రొద్దుటూరు పరిధిలో అనిబిసెంట్ మున్సిపల్ హై స్కూల్, (మెయిన్), వైయస్సార్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ యోగి వేమన యూనివర్సిటీ..రెండు కేంద్రాల్లో ఎన్రోల్ చేసుకున్న 532 మంది విద్యార్థుల్లో 523 మంది హాజరు కాగా 09 మంది ఆబ్సెంట్ అయ్యారు.

# కంచే చేను మేస్తే...




ఆకేపాటి రంగారెడ్డి పేరుతో ఉన్న ప్రభుత్వ భూములు





ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి పేరుతో ఉన్న భూములు



ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి పేరుతో ఉన్న ప్రభుత్వ భూములు



గుర్రం గుర్రాల కొండ వద్ద ఆక్రమించిన ప్రభుత్వ భూములు



రాయచోటి ఆకేపాడు రోడ్డులో కొండెక్కిన కబ్జా





### ప్రభుత్వ భూములకు రక్షణ ఎవరు 'కలెక్టర్' గారూ?... చట్టం వారికి చుట్టమా?

### వందల ఎకరాల భూములు రెవెన్యూ వెబ్ ల్యాండ్‌లో చేర్చిందెవరు?

**రాజంపేట అర్బన్, మే 04, ప్రభాతవార్త:**

ప్రభుత్వ భూములను రక్షించే బాధ్యత రెవెన్యూ అధికారులదే.. ప్రభుత్వ ఆవసరాలకు భూములను గుర్తించి ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయండి. ప్రభుత్వ భూములు ఎవరూ ఆక్రమించిన ఉపేక్షించ వద్దు...తహసీల్దార్‌ల సమావేశంలో శనివారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి. రెవెన్యూ చట్టం వారికి చుట్టంగా మారింది. ఆకేపాడులో రెవెన్యూ చట్టాలు వారికి వర్తించవు. ప్రభుత్వం అసైన్‌మెంట్ ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే బంజరు భూమి మంజూరు చేస్తుంది. పట్టా భూములు అయితే ఎవరి పేరుతో ఎన్ని అయినా ఉండవచ్చు. దానికి కూడ ల్యాండ్ సీలింగ్ చట్టం ఉంది. మరి ప్రభుత్వ భూములు ఒక కుటుంబంలో ప్రతి ఒక్కరికి ఎలా వస్తాయి. అది కూడ ఒక రెవెన్యూ గ్రామ పొలంలో కాదు వివిధ రెవెన్యూ గ్రామ పొలాల్లో ఎలా వస్తాయి. ఒక్కో కుటుంబంలో 100ఎకరాల పైబడి ప్రభుత్వ భూములు ఎలా వస్తాయి. వాటిని రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ ఎలా చేశారు. అది కూడ అనువంశికం పేరుతో ఎకరాల కొద్ది భూములు వారి పేరున రెవెన్యూ వెబ్ ల్యాండ్‌లో ఎలా చేరాయి. అసైన్ భూములు పంపిణీ చేసే కార్యక్రమం 8విడతలుగా జరిగింది. ఈ పంపిణీలో వారి పేర్లే లేవు. ఉన్నా ఒక్క సారి మాత్రమే ఒకరికే ఇవ్వాలి. అలా కాకుండా కుప్పలు తెప్పలుగా ప్రభుత్వ భూములు ఎలా వారికి వచ్చాయి. రెవెన్యూ రికార్డుల్లో ఎలా ఎక్కాయి. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన రెవెన్యూ అధికారులే ఆర్థిక, అధికార అంగబలం ఉన్న వారికి దారాదత్తం చేస్తే ఇక ప్రభుత్వ భూములను రక్షించేదెవరు. రక్షించే వాడే భక్షకుడు అయితే ప్రభుత్వ భూములకు దిక్కెవరు. కంచె చేనును మేస్తే ఏమి చేయాలి చట్టాలను పరిరక్షించాల్సిన అధికారులే తప్పు చేస్తే శిక్షించకుండా వదిలేస్తే వారు బరి తెగించర? అవినీతి అధికారులు బరి తెగిస్తే ప్రభుత్వ భూములు ఏమైపోతాయి. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే ప్రభుత్వ భూములను అక్రమంగా బడా నేతలు, వారి కుటుంబ సభ్యుల పేరుతో రెవెన్యూ రికార్డుల్లో ఎక్కిస్తే చట్టాన్ని అతిక్రమించడం కాదా.

ఈ అవినీతి అధికారులు ప్రభుత్వ సేవకులా లేకా నేతలకు సేవకులా అక్రమాలకు పాల్పడ్డ రెవెన్యూ అధికారులపై చర్యలు లేకపోవడమే ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. జిల్లా కలెక్టర్ ప్రభుత్వ భూముల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూద్దాం.

## పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**లక్కిరెడ్డిపల్లె : మే 04 ప్రభాతవార్త**

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లి మండలం, దిన్నెపాడు గ్రామంలో 2.30 లక్షలతో నిర్మించిన (మినీ గోకులం) పశువుల షెడ్డును మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెడుతూ వారి అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. పాడి రైతులందరూ ప్రభుత్వ పథకాలను సద్విని చేసుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం పశువుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామానికి మినీ గోకులాలను మంజూరు చేయడం జరిగిందని రైతులందరూ ఈ పశువుల షెడ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మినీ గోకులాల వల్ల పశువులు ఎండ, వాన, చలి వంటి సమస్యలకు ఇబ్బందులు పడకుండా ఆరోగ్యంగా జీవిస్తాయన్నారు. మినీ గోకులాల వల్ల పాడి రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మండల యువ నాయకుడు యనమల మదన్మోహన్, బీజేపీ మండల అధ్యక్షుడు హాస్పిటల్ కమిటీ సభ్యులు కొండూరు వెంకట్రామ రాజు, మాజీ జెడ్పిటిసి రెడ్డయ్య యాదవ్, శంకారపు జయరాం , ధర్మరాజు, షేక్ ఆరీఫ్, సిద్దిక వెంకటరామిరెడ్డి, రాజంపేట తెలుగు యువత అధ్యక్షుడు తోపిరెడ్డి నవీన్ కుమార్ రెడ్డి, సయ్యద్ మసూద్, ముక్తార్ అహ్మద్, జె.కె. రెడ్డి, భాస్కర్ రెడ్డి, సంజీవ రాజు, రఘురామ రాజు, లక్ష్మీరాజు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వాసుదేవ రెడ్డి భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించిన మంత్రి మండిపల్లి.

# మహానాడు వేదిక ఖరారు





**పెండ్లిమర్రి 04 ప్రభాత వార్త**


తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు వేదిక ఖరారు అయ్యింది. మొదటిసారిగా కడపలో ఈనెల 26, 27, 28 తేదీలలో తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మహానాడును కడప నగర శివారులోని పబ్బాపురంలోని ఉపాధ్యాయులకు సంబంధించిన స్థలంలో నిర్వహిస్తున్నారు. మహానాడు వేదిక ఖరారు కావడంతో ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే పుత్త చైతన్య రెడ్డి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పరిసరాలను పరిశుభ్రం చేసే కార్యక్రమానికి పూజ చేశారు. సుమారు 10 జేసీబీలను, ప్రొక్లైన్లను ఏర్పాటు చేసి స్థలాన్ని చదును చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 9వ తేదీన భూమి పూజ కార్యక్రమాన్ని ప్రారంభించి పనులను మొదలు పెట్టనున్నారు. నాలుగు లైన్ల రింగురోడ్డు కావడంతో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు పేర్కొన్నారు. సుమారు నగరానికి పది కిలోమీటర్ల దూరంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు గానీ మరే ఇతర సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# న్యాయ విజ్ఞాన సదస్సు

**కడప లీగల్, మే 4, ప్రభాతవార్త:**

ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా.సి.యామిని, సీనియర్ సివిల్ జడ్జీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబాఫక్రుద్దీన్ సూచనల మేరకు అసంఘటిత కార్మికులకు అవగాహన కార్యక్రమాల సందర్భంగా కడప నగరం రైతు బజార్ నందు వ్యవసాయ కార్మికులకు, మత్స్య కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టపరమైన సహాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులకు, ఉద్యోగి-యజమాని సమస్యలు, ఈ-శ్రమ కార్డుల పట్ల అవగాహన పెంచుకోవాలి. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అసంఘటిత కార్మికుల/వ్యవసాయ కార్మికుల యొక్క సమస్యలను గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 మొదలకు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి శ్రీనివాసులు, పారా లీగల్ వాలంటరీ ఈశ్వరయ్య, వ్యవసాయ కార్మికులు, మరియు మత్స్య కారులు పాల్గొన్నారు.



రాయచోటి పట్టణంలోని బండ్లపెంటలో ఉన్న దివానే సాహెబ్ దర్గా నందు జరుగుతున్న ఉరుసు ఉత్సవాలలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో జరుగుతున్న దివానే సాహెబ్ ఉరుసు ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు రావడం జరుగుతుందని ప్రతి సంవత్సరం భక్తులు సంఖ్య పెరుగుతూ ఉరుసు ఉత్సవాల అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

# కడప ఉక్కు కు నిధులు ఎక్కడ పనులు ఎక్కడ

**బద్వేల్ అర్బన్ మే 04 ప్రభాత వార్త:**

ఆంధ్ర రాష్ట్రానికి వచ్చినటువంటి ప్రధాని నరేంద్ర మోడీ గారు కడప ఉక్కు అలాగే కొప్పర్తి ప్రస్తావన సరే వాటికి నిధులు కేటాయించకుండా పనులు చేపట్టకుండా పనులు ప్రారంభంపై స్పష్టత ఇవ్వకపోవడం మరో మారు కడప జిల్లాకు మొండి చెయ్యి చూపించడమే అని అలాగే ఆంధ్ర ప్రజలను మరో మారు మాటలతో మోసం చేశారని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు ఆదివారం ఉదయం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కె మస్తాన్ షరీఫ్ ఎస్ కే ఆదిల్ ఉపాధ్యక్షులు యువరాజ్ లతో కలిసి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ.... ఈనెల రెండవ తేదీ శుక్రవారం రాష్ట్ర రాజధాని అమరావతిలో రెండవసారి రాజధాని నిర్మాణం కోసం శంకుస్థాపన దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులు మరో మారు శంకుస్థాపన లు చేస్తూ రాష్ట్ర ప్రజలకు అబద్ధాలు బూటకపు మాటలు చెప్పారని తీవ్రంగా విమర్శించారు గత 10 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం నుండి నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం కోసం నిధులుఇ తోదికంగా ఇచ్చామని బహిరంగ సభలో దేశ ప్రధాని అబద్ధాలు చెప్పారని నిజానికి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు కట్టిన టాక్స్ లలో 50 పైగా రాష్ట్ర వాటాగా రావాల్సిన నిధులు కూడా సక్రమంగా ఇవ్వలేదని అవాస్తవాలు ప్రజలకు చెప్పారని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లోకేష్ లు ఖండించలేదని వారు ఆరోపించారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కడప జిల్లాకు ఉక్కు పరిశ్రమ కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి ప్రస్తావన చేశారని కానీ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పనులు ఎప్పుడు చేపడుతారో నిధులు ఎంత కేటాయిస్తారో చెప్పలేదన్నారు కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ కు వచ్చిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను 300 కోట్ల రూపాయలు నిధులు ఆర్ జి బి బ్యాంకును విజయవాడకు తరలించుకొని పోయారని రాయలసీమ అభివృద్ధిని అంతా రాజధానికి తరలిస్తున్నారని పూర్తిగా మాయమాటలు మాట్లాడాలని వారు ఎద్దేవా చేశారు 5000 ఎకరాలలో రాజధాని నిర్మాణానికి సరిపోతుందని రాజధాని నిర్మాణ నిపుణులు ఒకపక్క తెలియజేస్తూ ఉంటే 34 వేల ఎకరాలు సేకరించారని ఇది ఎవరి ప్రయోజనాల కోసం అనేది అనుమానంగా ఉందని రైతులు చేసిన త్యాగాలు వారిచ్చిన భూములు కార్పొరేట్ సంస్థలకు బడా పారిశ్రామికవేత్తలకు అధికార పార్టీ మంత్రులకు ప్రభుత్వ అనుకూల వ్యాపారవేత్తలకు కారు చౌకగా కట్టపెట్టేందుకే ఇంత పెద్ద ఎత్తున భూసేకరణ చేశారని వారు ఆరోపించారు గతంలో ఇదే సీఎం ఇదే ప్రధానిని పిలిపించి శంకుస్థాపన అటహాసంగా రాజధాని పైరస్ ప్రారంభించిన ఆర్థిక సహాయ ఊసే ఎత్తలేదని గుర్తు చేశారు నాడు పిడికెడు మట్టి చెముడు నీళ్లు తప్ప ప్రధాని రాష్ట్రానికి ఏమి నిధులు విదిలించలేదని ఈ విషయాలు బాబు మరిచారా అని వారు ప్రశ్నించారు మోడీ నాయకత్వంలోని బిజెపి ఎన్డీఏ ప్రభుత్వాలు



మరోసారి మాయ మాటలతో అబద్ధాలతో ఆంధ్రులను మోసం చేశారని వారన్నారు అప్పులు తెచ్చి రాజధాని నిర్మిస్తే వడ్డీతో సహా ప్రజలపై భారాలు పడతాయని ఇప్పటికే ప్రజలపై మోయలేని టాక్స్ లు పన్నులు కరెంటు బిల్లులు సేవా బిల్లులు రకరకాల పేరిట మోపెడు భారం ప్రజలపై మోయ లేదంటగా వేశారని మూలిగే నక్కపై తాటికాయపడిన చందంగా పాలకులు ప్రజలను రక్షించాల్సింది పోయి భక్షిస్తున్నారన్నారు అని విమర్శించారు ప్రజల కొనుగోలు శక్తి రోజు రోజుకు దిగజారి పోతుందని పౌష్టికాహార లోపాలు పెరుగుతాయని వారన్నారు అనేక రూపాలలో వివిధ రకాల పన్నుల పేరిట ప్రజల ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఇది కాకుండా భవిష్యత్తులో రాజధాని నిర్మాణ అప్పులు వడ్డీల ఖర్చులు ప్రజలపై వేసి వసూలు చేయిస్తున్నారని వారు ప్రధాని మోడీ చర్యలను తీవ్రంగా ఖండించారు.

## కుక్కలను తప్పించబోయి ఆటో

**: ఒకరు మృతి - ఇద్దరికి గాయాలు**

**బద్వేలు అర్బన్ ,మే 4, ప్రభాతవార్త :**



అట్లూరు మండలం కుంభగిరి గ్రామం నుండి బద్వేలుకు ముగ్గురు ప్రయాణీకులతో కలిసి వస్తున్న ఆటో రాజుపాళెం సమీపంలోకి రాగానే ఒక్కసారిగా రెండు కుక్కలు అడ్డం రావడంతో కుక్కను తప్పించబోయి ఆటోబోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇరువురికి గాయాలు అయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన ఆటోను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని మృతి చెందిన వృద్ధుని వివరాలను వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆటో డ్రైవర్‌కు గాయాలు కావడంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బదలీల చట్టం మాదిరి ఫలితాల చట్టం తేవాలి

**లక్కిరెడ్డిపల్లి : మే 04, ప్రభాత వార్త**



ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయులకు తెచ్చిన బదిలీల చట్టం మాదిరిగానే 10వ తరగతి ఫలితాల సాధన కోసం ప్రత్యేక చట్టం రూపొందించి దానిని శాశ్వతంగా ఫలితాల అనంతరం బ్రిడ్జ్ కోర్స్ రూపంలో ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు కేంద్రాలను విద్యార్థుల సంఖ్యాపరంగా ఏర్పాటు చేసి అన్ని రకాల వసతులు కల్పించి సబ్జెక్టు వారీగా విద్యా వాలంటీర్లను గాని లేదా ఆసక్తితో కూడిన ఉన్నత మానవతా విలువలు కలిగిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను గాని నియమించి పారితోషకం లేదా గౌరవ వేతనం ఇచ్చి నిరంతరం ఈ బ్రిడ్జ్ కోర్స్ కేంద్రాలను కొనసాగించాలని అప్పుడే ఫలితాలు అనేవి 100 సాధించగలుగుతామని పి ఆర్ టి యు అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు మూడే సూర్యుడు నాయక్ జిల్లా ప్రధాన కార్యదర్శి శీపాల ఉమామహేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలా కాకుండా ఇప్పుడు కొనసాగిస్తున్న రెమెడియన్ తరగతుల బోధన పద్ధతి ఉపాధ్యాయులను వేధించడం కాక మరొకటి కాదని ఎక్కడో పదో పాతికో ఫెయిల్యూర్స్ ను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయుల సమ్మర్ వెకేషన్ను నాన్ వెకేషన్ గా మార్చి అందరికీ ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని కొనియాడారు. వెంటనే ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులతో కూడిన ప్రొసీడింగ్స్ ఇవ్వాలి లేదా ఎండ తీవ్రత దృష్ట్యా రెమెడియన్ తరగతులను వెంటనే రద్దు పరచాలి లేదా సమయాన్ని కుదించాలని పాఠశాల విద్యా కమిషనర్ ను కోరారు.

# భూ ఆక్రమణలకు పాల్పడితే.. చర్యలు తప్పవు..!





**కడప, మే 4 : ప్రభాతవార్త**

ప్రభుత్వ, ప్రయివేటు భూముల ఆక్రమణకు పాల్పడినట్లు తెలిస్తే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హెచ్చరికలు జారీ చేశారు. కడప మండలానికి సంబంధించి ఆంధ్రజ్యోతి, ఈనాడు మరియు సాక్షి దినపత్రికల యందు నందు 02.05.2025 వ తేదిన ప్రచురితమైన "ఖాళీ జాగాయేగా కాజేద్దాం!", "పాత కడప చెరువు ఆక్రమణ" "పాతకడప చెరువు వద్ద రగడ" అన్న శీర్షికల పై విచారణ కొరకై కడప జిల్లా కలెక్టరు చెరుకూరి శ్రీధర్ కడప రెవిన్యూ డివిజనల్ అధికారి, తహసిల్దారు మరియు కార్యాలయ సిబ్బందితో పాతకడప చెరువును 04.05.2025వ తేదీన సాయంత్రము తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీ నందు.. పత్రికల యందు ఆక్రమించి గ్రావెల్ తోలియున్నట్లుగా ఆరోపించియున్న భూమి.. పట్టా భూమిగా సర్వే నివేదిక ద్వారా తెలుసుకోవడం జరిగింది. తదుపరి కలెక్టరు సదరు గ్రావెల్ ఎవరు తోలియున్నారోనన్న విషయముపై సమగ్రముగా విచారించి మరియు చెరువు నందు ఎలాంటి ఆక్రమణలు జరిగియున్నాయో.. పూర్తిగా సర్వే చేసి నివేదిక ఇవ్వవలసినదిగా కడప తహసిల్దారు వారిని ఆదేశించియున్నారు. తదుపరి జిల్లా కలెక్టరు చెరువు నంది ఎలాంటి ఆక్రమణలు జరిగినను వారిపై కటినముగా చర్యలు తీసుకోనబడునని అందులో ఎంతటి వారినైనా రైతుల సంక్షేమము కొరకు ఉపేక్షించేది లేదని స్పష్టము చేసియున్నారు. ఇందు విషయమై మరింత లోతుగా విచారించి నివేదిక సమర్పించవలసినదిగా కడప రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు తహసిల్దారు వారిని ఆదేశించియున్నారు. ఈ కార్యక్రమములో కడప రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీ జాన్ ఇర్విన్, తహసిల్దారు నారాయణరెడ్డి, డిప్యూటీ తహసిల్దారు శివారెడ్డి మరియు సిబ్బంది కలెక్టరు వెంట వున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెవెన్యూ మాట్లాడుతూ... ఎవరైనా ప్రభుత్వ, ప్రయివేటు భూముల ఆక్రమణకు పాల్పడినట్లు తెలిస్తే... ఉపేక్షించేది లేదని, వారు ఎంతటివారైనా చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరికలు జారీ చేశారు

## మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి చర్యలు..

**లక్కిరెడ్డిపల్లె : మే 04 ప్రభాతవార్త**

రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం లక్కిరెడ్డిపల్లె మండల పర్యటన సందర్భంగా లక్కిరెడ్డిపల్లె మండలంలోని నరసింహారాజుగారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గదులు మరమ్మతులకు గురయ్యాయని వీటిని వెంటనే రిపేరు చేయించాలని గ్రామ ప్రజలు మంత్రికి తెలియజేశారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి పాఠశాల నూతన గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.



## తాసిల్దార్ కార్యాలయాన్ని అప్పగించకపోవడంపై హైకోర్టు న్యాయమూర్తికి ఫిర్యాదు

**రాజంపేట అర్బన్ ,మే4 ప్రభాతవార్త**



రాజంపేట తాసిల్దార్ కార్యాలయాన్ని న్యాయవ్యవస్థకు అప్పగించకపోవడంపై రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లకు రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత నాయుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర న్యాయమూర్తిని కడప రాష్ట్ర అతిథి గృహంలో కలిశారు. గతంలో న్యాయమూర్తులు, జిల్లా రెవిన్యూయంత్రాంగం మధ్య జరిగిన చర్చల అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణం లోని న్యాయ మూర్తి బంగాళా రెవిన్యూ కు బదిలీ చేయడం జరిగిందన్నారు.అయితే రెవిన్యూ వారు తహసిల్దార్ కార్యాలయం తమకు అప్పగించలేదన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.రాజంపేట కు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయాలని కోరారు.వీటిపై హైకోర్టు న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారని రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత నాయుడు తెలిపారు.హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన వారిలో న్యాయవాదులు రామచంద్ర నాయుడు,జాఫర్ బాషా,ప్రభాకర్ రావు, చంద్రశేఖర్ రెడ్డి వున్నారు.

## గంగమ్మ దేవత ఆలయంకి తరలి వచ్చిన వేలాది మంది భక్తులు

**భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు**

**లక్కిరెడ్డిపల్లె; మే 04, ప్రభాతవార్త**



మండలంలోని శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ తల్లికి వేలాది మంది భక్తులు ఆదివారం బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ బోనాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు ఆలయం కి తరలి రావడంతో అమ్మవారి దర్శనం కోసం తెల్లవారుజాము నుండే క్యూలైన్లో భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. లక్కిరెడ్డిపల్లె పోలీసులు తో పాటు ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు , ఆలయ పూజారులు చెల్లు గంగన్న కుమారులు సురేంద్ర యాదవ్ భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించే విధంగా చొరవ చూపుతూ అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.ఆలయ ప్రాంగణం చుట్టూ శీతల పానీయాలు అంగళ్లు, మిఠాయి కొట్టులు, అత్యధికంగా చెరుకుల బండ్లు ఆలయం ప్రాంగణం కి చేరుకోవడంతో చిన్న పాటి జాతరను తలపించింది.ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో భక్తులకు చలువ పందిళ్లు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పూజలు వేలాది మంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉద్యోగ, పెన్షనర్స్ కార్యదర్శిగా సురేందర్ రెడ్డి..

**సుండుపల్లి, మే 04, ప్రభాత వార్త:**



అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండల పరిధిలోని ముడుంపాడు గ్రామం తిమ్మారెడ్డి గారిపల్లి కి చెందిన రిటైర్డ్ టీచర్ మడితాటి సురేందర్ రెడ్డి ని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గం కార్యదర్శిగా నియమించడం జరిగింది. సురేందర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాపై నమ్మకంతో ఇచ్చిన హోదాను దుర్వినియోగం కాకుండా అన్ని విధాల అందరికీ న్యాయం చేయటకు కృషి చేస్తానని తెలియజేశారు. రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి మరియు రాజంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డికి కృతజ్ఞత తెలియజేశాడు

# గాజు వ్యర్థాలతో అందమైన కళారూపాలు

**భూమిపై పెరిగిపోతోన్న వ్యర్థాల్లో.. ప్లాస్టిక్కే కాదు.. గాజు శాతమూ ఎక్కువే. పైగా ఇవి మట్టిలో కలవడానికీ వేల ఏళ్ల పడుతుందట. ఈ విషయమే నోయిడాకు చెందిన మాధురీ బాలోడీని ఆలోచించచేసింది.** దీంతో పెద్దఎత్తున పోగవుతోన్న ఈ సీసాలను సేకరించి అప్‌సైక్లింగ్ ఆర్ట్ ప్రొడక్ట్స్ తయారు చేస్తున్నారు. వాటిని దేశవిదేశాలకు ఎగుమతి చేస్తూ ఆదాయం అందుకుంటున్నారు. మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.






మాధురి బాలోడీది నోయిడా. అక్కడే పుట్టిపెరిగా రామె. స్కూలు, కాలేజీ రోజుల్లో తను సాధారణ వద్యార్థే అయినా.. భవిష్యత్తుని వ్యాపార రంగంలో నిర్మించుకోవాలన్న తపనే తనని ఐఐఎమ్ బిజినెస్ స్కూల్లో పాఠాలు వినేలా చేశాయి అంటారామె. మనదేశంలోనే ఏటా మూడు విలియన్ టన్నుల గాజు వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిల్లో 40 శాతం మాత్రమే రీసైక్లింగ్ అవుతున్నాయి. మిలిగినవి వ్యర్థాలుగా మారిపోతున్నాయి. ఈ విషయం తెలిశాక.. గాజుని పునర్వినియోగించే మార్గాలను వెతికా. ఇందుకోసం అప్పటికే మీడియా రంగంలో పనిచేస్తున్న నేను ఉద్యోగాన్నీ వదిలేశా అని చెబుతారు మాధురి. స్నేహితుడు అమిత్ సింగ్‌తో కలిసి 2012లో ఆవిడ పొయెట్రీ ఆర్ట్ ప్రాజెక్ట్‌ని ఆరంభించారు. కాస్త సృజన, అభిరుచి ఉండాలే కానీ, ఏవస్తువునైనా అద్భుతమైన కళాఖండంగా మార్చేయొచ్చు. ఇందుకోసం చెత్త సేకరించే వ్యక్తులూ, డీలర్లను సంప్రదించారు.



బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, కేరళ వంటి అనేక రాష్ట్రాల నుంచి వీటిని సేకరిస్తున్నారు. ఆపై వాటిని శుభ్రం చేసి చూడముచ్చటైన ఆర్ట్‌పీస్‌లుగా, కిచెన్ ఐటెమ్స్‌గా తీర్చిదిద్దుతున్నారు. వాటిల్లో ల్యాంప్‌లు, క్రాఫ్ట్ క్లాక్‌లు, వాల్ ఆర్ట్ బ్యాగులు, ప్లాంటర్లు వంటివెన్నో ఉన్నాయి. అంతేనా, 140 టనునల వ్యర్థాలను వినియోగవస్తువులుగా మార్చినందుకు 'లిమ్కాబుక్



# ప్రధాని చేతులమీదుగా అవార్డు



**పట్టుమని పది నిమిషాల్లో సంప్రదాయ వంటల్నీ, క్షణాల్లో స్ట్రీట్ చాట్స్‌నీ వండి వడించేయగలదు. అతి తక్కువ దినుసులతో ఈమె చేసే వంటకాలకు కోట్లమంది ఫిదా అవుతున్నారు. అందుకే ఈ ఏడాది బెస్ట్ క్రియేటర్‌గా ప్రధాని మోదీ చేతులమీదుగా అవార్డునీ అందుకుంది. తాజాగా ఫోర్బ్స్ పట్టికలోనూ స్థానం సంపాదించింది 41 ఏళ్ల కబితాసింగ్.**

ఉత్తర, దక్షిణాది వంటకాలన్నీ సులువుగా చేయడం అమ్మ నుంచి నేర్చుకున్నాను అని చెప్పే కబితాసింగ్‌ది పుణె. చిన్నప్పటి నుంచి వంటపై ఆసక్తి. తల్లికి వంటగదిలో సాయాన్నీ అందించేది. ఆ తర్వాత చదువు, ఉద్యోగంతో బిజీ అయ్యింది. 2009లో పెళ్లై భర్తతో లండన్ వెళ్లడంతో కబితాసింగ్‌కు ఉద్యోగంలో విరామం దొరికింది. కొత్త వంటకాలను నేర్చుకోవడం మొదలుపెట్టా. అయిదేళ్ల తర్వాత ఇండియాకు తిరిగొచ్చాం. మా అబ్బాయి స్కూల్‌కెళ్లిన తర్వాత నాకు మళ్లీ సమయం దొరికింది. తిరిగి ఉద్యోగానికి వెళ్లదమంటే బాబు సంరక్షణ చూసుకోవాలి. దాంతో నా చిన్నప్పటి అభిరుచికి పెద్దపీట వేసి వంట వీడియోలు చేయాలనుకున్నా. 2014లో 'కబితాస్‌కిచెన్' పేరుతో యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించా. వంట పరిచయం లేనివాళ్లకు అర్థమయ్యేలా వంట చేసి చూపించడంతోపాటు, వాళ్లడిగే సందేహాలూ తీర్చేదాన్ని. ఆ తర్వాత వాళ్ల నుంచి ఫీడ్‌బ్యాక్, సలహాలు తీసుకుంటూనే, వాళ్లు కోరిన వంటకాలు చేసిచూపించేదాన్ని. సీజన్‌కు తగిన, పండగలకు సంబంధించిన వాటినీ వీడియోల్లో జత చేస్తుంటా. అలాగే ట్రెండింగ్‌లో ఉన్నవాటితోపాటు కొన్ని ప్రత్యేక వంటకాలు చేసి వారానికి మూడు వీడియోలు పోస్ట్ చేసేలా ప్రణాళిక వేసుకున్నా. అలా మా వంటింట్లోనే మొదట ఫోన్ కెమెరాలో నేను తీసిన వీడియోలకు అభిమానులు పెరిగారని గురునత చేసుకుంటుందీమె.

**స్థానాన్ని దక్కించుకుని....** కబితాసింగ్ తన వంటకాలతోపాటు సబ్జీ, చికెన్, పావ్‌బాజీ మసాలాలను తయారుచేసి ప్రచారమైన చేస్తోంది. దీనికి దేశవ్యాప్తంగా మార్కెట్‌లో మంచి స్పందన వచ్చింది. అంతేకాదు, వంటింట్లో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వంటి చిట్కాలు, ప్రతి పదార్థాన్ని వృథా కాకుండా నిల్వ చేయడమెలాగో కూడా చెబుతోందీమె. మొదట్లో వ్యాపారవేత్తగా ఉన్నా క్రమేపీ నయా ఆలోచనలతో కంటెంట్ క్రియేటర్‌గా మారిన కబితాసింగ్ ఈ ఏడాది ఫుడ్ క్యాటగిరిలో 'బెస్ట్' క్రియేటర్ అవార్డును ప్రధాని మోదీ చేతులమీదుగా అందుకుంది. తాజాగా ఫోర్బ్స్ క్రియేటర్స్ పట్టికలో స్థానాన్నీ దక్కించుకుంది. ప్రస్తుతం ఈమె వంట వీడియోలకు యూట్యూబ్‌లో 1.39 కోట్లమంది సబ్‌స్క్రైబర్లు, ఇన్‌స్టాలో కోటి మంది ఫాలోయర్లున్నారు. మనసుకు నచ్చింది చేస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అప్పుడు ఏ రంగంలోనైనా విజయం దరిచేరుతుంది. అంతేకాదు, అది మరికొందరికి మనల్ని స్ఫూర్తిగా నిలబెడుతుందని చెబుతుందీమె. □

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**తొండూరు, మే 4 (ప్రభాతవార్త) :**
ఉన్నత పాఠశాలలో 2003, 04 విద్యా సంవత్సరంలో పదవతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కృష్ణారెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది, విద్యార్థులు ఆనందంగా జరుపుకున్నారు. మధురమైనది స్నేహబంధం మరపురానిది స్నేహబంధం సృష్టిలో అన్నిటినీ మించి అందరిని అలరించే బంధం స్నేహబంధం అంటూ మన మంతా ఒక్కటే అనే విధంగా సాగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మనుషులు వీడి రెండు దశాబ్దాల పైన గడిచింది. రోజు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకుని సంబరపడ్డారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 60 మందికి పైగా విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, నాటి గురువులు నాగిరెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రమణారెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాసులు, ప్రదీప్, మధు, లక్ష్మీనారాయణ రెడ్డి, రమణ పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వ్యాపారికి నష్టం

**పీలేరు మే 4 ప్రభాతవార్త :**



కాలుతున్న దృశ్యం

మండలంలోని చింతపర్తికి చెందిన వ్యాపారస్థుడు బొంతల వెంకటేష్ శెట్టికి సంబంధించిన గోదాములో ఆదివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి గోదాములోని అంగడి ముడి సరుకులు కాలి బూడదయ్యాయి. వెంకటేష్ శెట్టి చింతపర్తిలో వాసవీ సూపర్ మార్కెట్‌ను నిర్వహిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన ముడి సరుకులను చింతపర్తి డీఎస్పీవీధిలోని ఓ పాత గోదాములో నిల్వ చేశాడు షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం ఉదయం ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. అప్పటికే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే గోదాములోని దాదాపు రూ.7 లక్షల ముడి సరుకుల కాలి బూడిదైపోయాయని బాధితుడు వాపోయాడు. స్థానిక పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటో యూనియన్ అధ్యక్షులకు శ్రామికశక్తి అవార్డు

**పీలేరు మే 4 ప్రభాతవార్త :**



అవార్డును అందుకుంటున్న బోధేషావలి

రాష్ట్ర బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోదేశా వల్లికు శ్రామిక శక్తి అవార్డును తిరుపతి ఈ ఎస్ ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు చేతుల మీదుగా శనివారం తిరుపతిలో యూత్ హాస్టల్ నందు నిర్వహించిన సమావేశంలో శ్రామిక శక్తి అవార్డును ఆదివారం అందుకోవటం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షులు బోదేశావల్లి విలేకరులతో మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఆటో కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులను అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు బోదేశావల్లికి శ్రామిక శక్తి అవార్డు అందుకోవటం పట్ల ఆటో కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం తమ పోరాటాన్ని కొనసాగించడం జరుగుతుందని బోదేశావల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రత్నకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్, ఎస్బిఐ స్టాఫ్ యూనియన్ జనరల్ సెక్రటరీ మూర్తి తదితరులు శ్రామిక శక్తి అవార్డును అందుకున్న బోదేశా వల్లిని అభినందించారు.

## షీ దివ్య యోగ విద్యాలయంలో "యోగ శ్రీ" సర్టిఫికెట్ అందుకున్న నిజామాబాద్‌కు చెందిన ప్రద్యున్

**పీలేరు మే 4 ప్రభాతవార్త :**




సర్టిఫికెట్ ప్రధానం చేస్తున్న లక్ష్మి

తెలంగాణ రాష్ట్రం, నిజామాబాద్ పట్టణానికి చెందిన విద్యార్థి ప్రద్యున్ వేసవి సెలవుల సందర్భంలో పీలేరులోని ప్రముఖ యోగా శిక్షణా కేంద్రమైన షీ దివ్య యోగ విద్యాలయంలో యోగ శిక్షణ తీసుకుని విజయవంతంగా తన శిక్షణను పూర్తి చేశాడు. ఈ నేపథ్యంలో, ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో, ప్రద్యున్ కు "యోగ శ్రీ" సర్టిఫికెట్‌ను విద్యాలయం అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్ లక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన ప్రద్యున్, ఈ యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఎంతో శ్రద్ధగా, నిబద్ధతతో పూర్తి చేసి ఖియోగ శ్రీఖి సర్టిఫికెట్ పొందినందుకు అతడిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాం" అని తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో భాగంగా వివిఎస్ఎన్ సిద్ధార్థ స్మార్ట్ కిడ్స్ విద్యా సంస్థ నుండి 30 మంది విద్యార్థులు, శ్రీ భువన విద్యాలయం నుండి 40 మంది విద్యార్థులు, మరియు కలికిరి సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల నుండి 200 మంది విద్యార్థులు యోగా శిక్షణను పూర్తి చేసి "యోగ శ్రీ" సర్టిఫికెట్ ను అందుకున్నారని ఆమె పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ పివిఎస్ లక్ష్మి మాట్లాడుతూ, "యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిన ఈ సమయంలో, ప్రతి ఒక్కరూ యోగా అభ్యాసం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు. ప్రతి సంవత్సరం జూన్ 21వ తేదీన జరుపుకునే ఖిప్రపంచ యోగా దినోత్సవంఖి, మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా దీనిని ఎంతో గౌరవప్రదంగా భావిస్తున్నట్టు ఇటీవల పేర్కొనడం గర్వకారణం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ న్యాయ సలహాదారు డాక్టర్ రాయల సుధాకర్ రాయలు, ప్రద్యున్ తండ్రి నరసయ్య , శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లోన్ యాప్‌కు యువకుడు ఆత్మహత్య


**మదనపల్లెక్రైమ్, మే 4 ప్రభాతవార్త.**



లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య పాల్పడిన విషాదకర సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి మండలంలోని వేంపల్లి పంచాయతీ జంగాలపల్లి కు చెందిన రైతు చిన్నరెడ్డప్ప కొడుకు శ్రీకాంత్ (26) లోన్ యాప్ ద్వారా అప్పు తీసుకున్నాడు. ఆ అప్పును సకాలంలో చెల్లించలేక పోయాడు. దీంతో లోన్ యాప్ నిర్వాహకులు వేధింపులు అధికమయ్యాయి. అప్పు తీసుకొన్న విషయం ను ఇంట్లో వారి ఫోన్ కూడా చేసి చెప్పడంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ ఉదయం ఊరికి సమీపంలోని పూలతోట వద్దకు వెళ్లి, పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు అతన్ని హుటాహుటిన మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతదేహమును శవపరీక్షల నిమిత్తం మార్చురీకి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మస్తాన్ షా ఖాధరీ దర్గా ఉరుసు గంధం


**రామసముద్రం మే 4 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని దిన్నిపల్లె సమీపంలో ఉన్న గాంధీనగర్‌లోని మోక్సీత గ్రానైట్ ఎదురుగా ఉన్న శ్రీ హ్రజత్ మాన్ ఫీర్ సయ్యద్ మస్తాన్ షా ఖాధారీ ఏడవ గంధం ఉరుసు 6,7తేదీల్లో మంగళవారం బుధవారం రెండు రోజులు పాటు ఘనంగా నిర్వహిస్తామన్నారు. పకీర్ల మేళతాళాలతో బాణాసంచాలు కాల్చుతూ డప్పు వాయిద్యాలు నడుమ పూల చాందిని అలంకరణతో గందోత్సవాన్ని పురవీదులు గుండా ఊరేగింపు నిర్వహించి అనంతరం దర్గాలోని స్వామి మజార్సె పై ఎక్కిస్తామన్నారు ప్రతి హిందూ ముస్లిం సోదరులు పవిత్ర గంధంలో పాల్గొనాలన్నారు. ఉరుసుకార్యక్రమంలో మైసూర్ బృందం వారిచే గొప్ప కావ్వాలీ ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మన్ ఫీర్ సయ్యద్ బృహన్ షా ఖాదరీ (మైసూర్ )మన్ ఫీర్ సయ్యద్ గౌస్ షా ఖాదరీ (బాబు)సయ్యద్ బాబా, ఇమ్రాన్ షా ఖాదరీ, హ్రజత్ హజ్బుర్ షా ఖాదరీ, తోషిఫ్ ఖాదరీ, దర్గా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉరుసు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాల్గొంటారన్నారు. దర్గా కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్న దానం నిర్వహించడం జరుగుతుందన్నారు.

## వైభవంగా శ్రీశ్రీశ్రీ ఉలవల గంగమ్మ జాతర ప్రారంభం

**పీలేరు మే 4 ప్రభాతవార్త :**



పూజలకు హాజరైన ధర్మకర్త

పీలేరు మండలం, తలుపుల పంచాయితీ లో శ్రీశ్రీశ్రీ ఉలవల గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి జరిగే మూడు రోజుల జాతర కార్యక్రమాలకు ఆదివారం శ్రీకారం చుట్టామని ఆలయ ధర్మకర్త, కార్య నిర్వాహకులు జె. వెంకటరమణ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించే కార్యక్రమాలతో జాతర మొదలైందన్నారు. జాతర ప్రారంభం రోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారని చెప్పారు. అదేవిధంగా రాత్రి ఆలయం వద్ద జరిగే కార్యక్రమాలలో పాల్గొనే భక్తులకు సౌకర్యంగా భక్త చింతామణి నాటక ప్రదర్శనతో పాటు బాల నాగమ్మ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ అర్చకులు గణేష్ రాజు అమ్మవారికి విశేష అలంకరణ, పూజలు చేసి దర్శనం కోసం వచ్చిన భక్తులకు తీర్థ, ప్రసాదాలు విచరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ నిర్వహకులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

**చాపాడు. మే 4. ప్రభాతవార్త**



మండల పరిధిలోని అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలల యందు (06) సంవత్సరముల వయసుగలపిల్లలకు పెండింగ్, కొత్త ఆధార్ నమోదు ప్రక్రియకు కొరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వీర కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. మదూరు 5 తేదీన అన్నవరం 6, చియ్యపాడు 7, సోమాపురం 8,చాపాడు 12, ఎన్ఓబాయపల్లి పల్లె 13, బద్రిపల్లి 14,అల్లాడుపల్లి 15,సచివాలయాల యందు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఓటుతో గెలవలేని మీకు విమర్శించే స్థాయి ఎక్కడిది



**తంబళ్లపల్లె మే 4 ప్రభాతవార్త ః**
దౌర్జన్యాలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఓటుతో గెలవలేని మీరు మా నాయకుడు చినబాబు ను విమర్శించే స్థాయి మీకెక్కడిదని మండల టిడిపి అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి ఆగ్రహించారు. ఆదివారం తంబళ్లపల్లె టిడిపి ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీరామ్ చిన్నబాబు తంబళ్లపల్లె టిడిపి నాయకుడు కృష్ణమూర్తి కుమారునిపై చేసిన దాడి పై విమర్శలు చేయగా తంబళ్లపల్లె కు చెందిన పదవులు లేని నారాయణరెడ్డి, జై సింహ రెడ్డిలు కనీసం వార్డు మెంబర్ కానీ మీరు మా నాయకుని విమర్శించే స్థాయి మీకు లేదని విమర్శించారు. దొడ్డిదారిన గెలిచి మీరు పెంచి పోషించిన గంజాయి బ్యాచ్ చేసిన దాడి కాదా అని ప్రశ్నించారు. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మీ ఎమ్మెల్యే మా భూమి ని ఆక్రమించారని ఇదిగో సాక్షాలని మీరా నీతులు మాట్లాడేదని ఎద్దేవా చేశారు. క్లస్టర్ ఇంచార్జ్ బేరి శ్రీనివాసులు మాట్లాడుతూ మాపై ఆక్రమంగా ఎస్సీ కేసులు బనాయించి దాడులు, దౌర్జన్యాలు చేసే సంస్కృతి మీదని మా నాయకుడు ఆ సంస్కృతి నేర్పలేదని ఆవేశంగా మాట్లాడాడు. స్థానిక ఎన్నికల్లో అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని దొడ్డిదారిన గెలిచిన మీరు దమ్ముంటే వెంటనే రాజీనామా చేసి ఎన్నికల్లో నిలిచి ప్రజలు ఓటుతో గెలవాలని సవాలు విసిరారు. మహిళా నాయకురాలు సిద్ధమ్మ మాట్లాడుతూ మా నాయకుడు శ్రీరామ్ చినబాబు మీద ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు, మాజీ జడ్పిటిసి రామచంద్ర, భయ్యమ్మ చెరువు చైర్మన్ ఆదిరెడ్డి, యువ నేత జగదీష్, బీసీ నాయకుడు శివరాం, మైనార్టీ నాయకుడు గులాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజ్ ప్రకటించాలి

**ఎడ్యుకేషన్ మే 4 ప్రభాతవార్త :**



రాష్ట్రానికి ప్రత్యేక హోదా వెనుకబడిన జిల్లాలకు బుందేల్ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని (ఆర్ సి పిఐ) రెవల్యూషనరీ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జుల రమణయ్య డిమాండ్ చేశారు రాష్ట్ర రాజధాని అమరావతి శంకుస్థాపనకు రెండోసారి శంకుస్థాపన వచ్చిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారన విమర్శించారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క ప్రజా నాయకుడు కూడా అటు ప్రత్యేక హోదా పైన కానీ పోలవరం ప్రాజెక్టు పైన కానీ విభజన హామీలకు సంబంధించినటువంటి విశాఖ రైల్వే జోన్ మరియు కడప ఉక్కు కర్నూలు లో న్యాయ రాజధాని ఏర్పాటుకు ప్రయత్నాలు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కడప జిల్లాకు ఉక్కు పరిశ్రమ, కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ ప్రస్తావన చేశారని కానీ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పనులు ఎప్పుడు చేపడతారో నిధులు ఎంత కేటాయిస్తారో చెప్పలేదన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక హోదా పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు దీనిపక్షంలో రాబోయే కాలంలో భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కలిసొచ్చే పార్టీలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రోగ్రెస్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కొడవటికంటి నాగరాజు, నాయకులు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు మంత్రి ఆర్థిక సాయం



గాయపడిన లక్ష్మయ్య ను పరామర్శిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**లక్కిరెడ్డిపల్లె : మే 04 ప్రభాత వార్త**
మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం లక్కిరెడ్డిపల్లె పర్యటన సందర్భంగా వడ్డేపల్లి గ్రామానికి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి గ్రామానికి చెందిన ఆర్.లక్ష్మయ్య తన కాలుకు గాయం ఏర్పడడంతో వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేయాలని మంత్రిని కోరారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి అప్పటికప్పుడే ఆయన వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేసి లక్ష్మయ్య కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఫోన్ చేసి తెలిపారు.

## 40 మంది పిల్లలకు ఉచిత ఒడుగులు



**యర్రగుంట్ల మే 4 ప్రభాతవార్త**
ముస్లిం పిల్లలకు ఒడుగులు చేయటం సర్వసాధారణం అయినప్పటికీ నిరుపేద ముస్లిం పిల్లలకు ఒడుగులు చేయించుకోవటం చాలా ఖర్చుతో కూడుకున్నటువంటి విషయం అలా చేయించుకోలేని నిరుపేద ముస్లిం పిల్లలకు వలస పల్లె రోడ్డు లోని మసీదు కమిటీ సభ్యులు దాదాపుగా 40 మంది ముస్లిం పిల్లలకు ఉచిత ఒడుగులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మసీదు కమిటీ సభ్యుల సమక్షంలో ప్రొద్దుటూరు కు చెందిన డాక్టర్ ఆజాద్ నిర్వహించారు. ఒడుగులు చేయించుకున్న పిల్లలకి వారం రోజులు సరిపడా ఆయిల్, గోధుమపిండి, బట్టలు, బ్రెడ్ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపి జె రాయలసీమ ఇంచార్జ్ ఆయుబ్ ఖాన్ జిల్లా ప్రతినిధి ముక్తియార్,ఎం పి జె ప్రెసిడెంట్ హుస్సేన్ భాష పాల్గొని విజయవంతం చేశారు. అనంతరం డాక్టర్ ఆజాద్ కు మసీదు కమిటీ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రెసిడెంట్ కమల్ భాష, షరీఫ్, చాంద్ బాషా, ఇమాన్యుల్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భగీరథ జయంతి వేడుకలు



**చాపాడు. మే 4. ప్రభాతవార్త..**
మండల పరిధిలోని పల్లవోలు శ్రీ అంకాలమ్మ దేవస్థానం నందు ఆదివారం భగీరథ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథుడు మహా జ్ఞాని, పరోపకారాన్ని పెట్టని పేరు, దీక్షకు సహనానికి ప్రతిరూపం, భగీరథుని మహాదీక్షతో గంగా నది పాతాళం చేరి సగరపుత్రుల చితభష్మంపై ప్రవహించి సద్గతులను చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాదాసు మురళి, మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షుడు మొగిలి రామాంజనేయులు, మొగిలి చంద్రుడు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## గృహవిద్యుత్ అదనపులోడు
# క్రమబద్దీకరణకు రాయితీ

ఈఈ గంగాధరం

**మదనపల్లె, మే 4 ప్రభాతవార్త :**
గృహవిద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీ కల్పిస్తున్నామని మదనపల్లె డివిజన్ విద్యుత్ ఈఈ గంగాధరం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాలకు అనుగుణంగా వినియోగదారులు వినియోగిస్తున్న అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు జూన్ 30లోపు స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అదనపులోడు క్రమబద్ధీకరణకు వినియోగదారులు చెల్లించాల్సిన మొత్తంలో 50శాతం రాయితీ కల్పిస్తున్నామని తెలిపారు. ఈ రాయితీ సౌకర్యాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరడమైంది.

## జేసిఆర్‌తోపాటు మీకు నేను సైతం అండగా ఉంటా!

**దాసరిపల్లి కల్పనా రెడ్డి.**

**తంబళ్లపల్లె మే 4 ప్రభాతవార్త ః**



తంబళ్లపల్లె నియోజకవర్గంలో కార్యకర్తలకు సంబంధించి ఎలాంటి కార్యక్రమానికైనా దాసరిపల్లి జయచంద్రారెడ్డి తప్పక హాజరవడం పరిపాటి. ఆయన సొంత పనులపై విదేశాలకు వెళ్లగా ఆయన సతీమణి దాసరిపల్లి కల్పనా రెడ్డి భర్త అడుగుజాడలే శిరోధార్యంగా తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లి పంచాయతీ మొరుసుపల్లి బురుజులో టిడిపి కార్యకర్త శివారెడ్డి తల్లి యశోదమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న కల్పన రెడ్డి హుటాహుటిన ఆ గ్రామానికి చేరుకుంది. యశోదమ్మ భౌతిక కాయానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. శివారెడ్డి కుటుంబాన్ని ఓదార్చి ఎల్లవేళలా పార్టీ మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధి కోసం జయచంద్రారెడ్డి కృషి చేస్తున్నారని అదేవిధంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సహకరిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ నాయుడు, కాలా నారాయణ, పెద్ద వీరభద్ర, జైపాల్ నాయుడు, మధు తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 7న వాసవీ మాత జయంతి

**ప్రొద్దుటూరు అర్బన్, మే 4, ప్రభాతవార్త :**
స్థానిక మెయిన్ బజార్ లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో బుధవారం అమ్మవారి జయంతి మహోత్సవం జరుగుతుందని ఆర్యవైశ్య సభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుశెట్టి రామ్మోహన్ రావు, మురికి నాగేశ్వరరావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటలకు మహాప్రాకార ప్రదక్షిణం,తదుపరి చండీహోమం, పంచామృతాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన, 12 గంటలకు పూర్ణాహుతి జరుగుతుందని వివరించారు. తదుపరి సాయంత్రం 7 గంటలకు 102 మంది ఆర్యవైశ్య సుహాసినులచే శ్రీవాసవిమాతకు లక్ష కుంకుమార్చన జరుగుతుందని తెలిపారు. కావున భక్తాదులందరూ ఈ పూజా కార్యక్రమ ములలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించి శ్రీ వాసవిమాత అనుగ్రహము పొందవలసినదిగా కోరారు.

## కోవర్టులకు నామినేటెడ్ పదవులు ఎలా ఇస్తారు

**ఆర్‌జె,వెంకటేష్**

**మదనపల్లె, మే 4 ప్రభాతవార్త :**



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ బలోపేతం కోసం చేసిన కృషిని గుర్తించకపోగా, వైసిపి కోవర్టులకు నామినేటెడ్ పదవులు ఇవ్వడం సమంజసంగా లేదని టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటష్ అన్నారు. నిమ్మనపల్లె రోడ్డు టిడిపి కార్యాలయంలో ఆదివారం స్థానిక విలేకర్ల సమావేశంలోఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండి పోరాటాలు చేసి, కేసులు పెట్టించుకొని జైలుకు వెళితే వారికి పదవులు ఇవ్వకుండా, వైసిపి కోవర్టులకు పదవులివ్వడం ఏంటని ప్రశ్నించారు. నామినేటెడ్ పదవులు ఇవ్వడంలో ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితులు తెలుగుదేశం పార్టీలో చోటు చేసుకొన్నాయని తెలిపారు. నియోజకవర్గంలనో టిడిపి నాయకులపై అక్రమ కేసులు సుమారు 40మందిపై పెట్టారని నిత్యం కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారిని గుర్తించకుండా వైసిపి కోవర్టులకు పదవులు ఇవ్వడం ఎంతవరకు న్యాయమన్నారు. పార్టీకోసం పనిచేసే కార్యకర్తలకు వీలైనంత త్వరగా నామినేటెడ్ పదవుల్లో నియమించి తగు న్యాయంచేయాలని చంద్రబాబునాయుడుని కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాటకొండ మధుబాబు, పూలమురళి, మల్లికార్జున, మాజీ సర్పంచ్ రాజన్న, లక్ష్మన్న, గండికోట గణేష్ పాల్గొన్నారు.

## 11న మోడల్ ఈఏపిసెట్‌పై పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**కురబలకోట, మే 4 ప్రభాతవార్త :**
మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 11న మోడల్ ఈఏపిసెట్ ప్రాక్టీస్ పరీక్షలు 2025 నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. ఆన్‌లైన్‌లో పరీక్ష విద్యార్థులకు ఏ విధంగా ఉంటుందో సరైన సమయంలో విద్యార్థులు ఆ పరీక్షను ఎలా నిర్దేశించగలరో తెలియజేయుటకు విద్యార్థలకు ఈ మోడల్ పరీక్షను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి పోస్టర్లను ఆవిస్కరించారు. ఆన్‌లైన్‌లో విద్యార్థులకు పరీక్షలు ఏ విధంగా ఉంటుందో సరైన సమయంలో విద్యార్థులు పరీక్షను ఎలా నిర్దేశించగలరో తెలియజేయుటకే విద్యార్థులకు ఈ సదవకాశాన్ని మిట్స్ కళాశాల వారు ఉచితంగా మే11న ఉదయం 10గంటలకు, మద్యాహ్నం 2గంటలకు నిర్వహిస్తామని కంప్యూటర్లను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనపరచిన పదిమంది విద్యార్థులకు ఒకొక్కరికి రూ.5వేలు చొప్పున నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. రిజిస్ట్రేషన్ల కోసం 8712655132, 8712655138 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## తల్లి బిడ్డ అదృశ్యంపై కేసు నమోదు.

**రామసముద్రం మే 4 ప్రభాతవార్త**



తల్లి బిడ్డ అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. రవికుమార్ తెలిపారు. ఎస్సై రవికుమార్ వివరాల మేరకు రామసముద్రం మండలం ఎర్రబోయినపల్లి పంచాయతీ కమ్మవారి పల్లి గ్రామానికి చెందిన గాయత్రి(26) ఆమె కుమారుడు అఖిల్(3) ఈనెల 3 వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అన్ని చోట్లా వెతికిన ఫలితం లేకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పేద ముస్లిం బాలురకు ఉచిత వడుగుల మహోత్సవం



**ప్రొద్దుటూరు అర్బన్, మే 4 ప్రభాతవార్త:**
గత 40 సంవత్సరాలుగా హబీబున్నీసా మస్జీద్ కమిటీ వారు ఉచిత సేవా కార్యక్రమాలు జరుపుతూ 41 వ వార్షికోత్సవంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆదివారం స్థానిక కేహెచ్ఎం స్ట్రీట్ లోని వైయస్సార్ పార్క్ నందు సుమారు 170 మంది పేద ముస్లిం బాలురకు ఉచిత వడుగుల మహోత్సవం నిర్వహించారు. అనంతరం ఆ బాలురకు ఐదు కిలోల గోధుమపిండి, ఒక నూనె ప్యాకెట్, ఒక జత బట్టలు, మరియు పది రోజులకు సరిపడా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉదయం 500 మందికి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అనేకమంది దాతలు ఆర్థిక సహాయం అందజేశారు. డాక్టర్లు కూడా ఉచితంగా వడుగులు చేసి వారి ఉదారత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గవర్నమెంట్ కాజీలు జనాబ్ నజీర్ మోలానా, మరియు జనాబ్ ఆరిఫుల్లా విచ్చేశారు. ఈ సందర్భంగా హాబీబున్నీసా మస్జీద్ కమిటీ అధ్యక్షులు వి.ఎస్. ముక్తియార్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాట్లాడుతూ దాతలకు మరియు డాక్టర్లకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి ప్రజా ఉపయోగకర కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.

## మండిపల్లి నాగిరెడ్డి ఆశయ సాధనకు తమ వంతు కృషి

**చిన్నమండెం, మే 4 ప్రభాతవార్త :**
స్వర్గీయ మండిపల్లి నాగిరెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన సమాధి వద్ద మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కొబ్బరికాయ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ తండ్రి మండిపల్లి నాగిరెడ్డి గతంలో శాసనసభ్యునిగా రాయచోటి నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేయడం జరిగిందన్నారు. నేడు ఆయన స్ఫూర్తితో నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో తమ తండ్రి ఆశయ సాధన కోసం రాయచోటి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి మోనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మండిపల్లి కుటుంబ సభ్యులు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



